క్లుప్తంగా

పరామర్శ



కోడేరు: మండల కేంద్రానికి చెందిన వట్టెల బాలపీరు రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి జూపల్లికృష్ణారావు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థికంగా సాయం చేస్తానని హామీ ఇచ్చారు.

ఉపాధి పనులపై నిర్లక్ష్యం వద్దు

చారకొండ: గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై అధికారులు, కూలీలు నిర్లక్ష్యం వహించవద్దు ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండలంలోని జేపల్లిలో శనివారం ఉపాధి పనులను, నర్సరీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో ఉపాధి పనుల రిజిస్టర్లను పరిశీలించారు. వారితో పాటు సర్పంచ్ రవీందర్‌రెడ్డి, ఎంపీఓ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందజేత

కోడేరు: మండలంలోని ఎత్తం చెందిన బిచ్చయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తన నివాసంలో రూ.75 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆంజనేయస్వామికి పూజలు



పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని ఆకుతోట అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అర్చనలు, పంచామృతాభిషేకాలు, ఆకుపూజ చేశారు. చుట్టుపక్కల పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు.

ప్రత్యేక పూజలు

వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌లో శనివారం బొడ్రాయి ఉత్సవాల్లో భాగంగా హనుమాన్ దేవాలయ ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న వారు గ్రామానికి చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ లక్ష్మమ్మ పలువురు పాల్గొన్నారు.

నెహ్రూకు ఘన నివాళి

కొల్లాపూర్: జాతి నిర్మాణకర్త పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని ఇందిరాగాంధీ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు రంగినేని జగదీశ్వరుడు అన్నారు. నెహ్రూ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం పట్టణంలో నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో సర్పంచ్ రేవతి శనివారం డ్రెయినేజీ పనులు ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గోపాల్‌నాయక్, రాజశేఖర్, లాలయ్య, భీమరాజ్, చంద్రమౌలి ఉన్నారు.

సీసీరోడ్డుకు నిధులు మంజూరు

వెల్దండ: మండలంలోని నారాయణపూర్‌తండాలో సీసీరోడ్డుకు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రూ.5లక్షల ప్రొసిడింగ్ కాపీని గోపాల్‌నాయక్ అందజేశారు. తండా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో 4వ వార్డులోని 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్పంచ్ ఖాజా ప్రారంభించారు. 30ఏళ్ల నుంచి కాలనీలో కరెంట్ సమస్య విపరీతంగా ఉందన్నారు. ఎమ్మెల్యే చొరవతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రణీత, ప్రమోద్‌గౌడ్, రవి, జయన్న, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై జీలుగ విత్తనాలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో 10 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు ఉన్నాయని, రైతులకు 65శాతం రాయితీపై ఇస్తున్న ఏఓ నాగరాజు తెలిపారు. ఈ విత్తనాలు వాడటం ద్వారా వరి పొలాలు, చవుడు భూములు వేర్ల బుడిపెల నుంచి నత్రజని స్థిరీకరణ చేస్తుందని దీన్ని వరి నాటడానికి 50 రోజుల ముందు సాగు చేయాలన్నారు. ఎకరాకు కనీసం 8 నుంచి 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందని తెలిపారు. జీలుగ కావాల్సిన రైతులు 30 కేజీల బస్తా రూ.843 ఇస్తున్నట్లు తెలిపారు. పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకుపాస్‌బుక్, ఫోన్ నంబర్‌తో వ్యవసాయ కార్యాలయంలో తీసుకోవాలని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు

లింగాల: మండలంలోని పలు గ్రామాలకు సమీపంలో రోడ్డు కూడళ్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. కూడళ్ల వద్ద ఆర్‌అండ్‌బీ వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గాలికి వదిలేయడంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు మృత్యువాత పడ్డారు. లింగాల నుంచి కొల్లాపూర్ వెళ్లే మార్గంలో కూడలిలో గతంలో కూలీలను తీసుకెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందారు. ఇదే మార్గంలో ద్విచక్ర వాహనదారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. లింగాల నుంచి తెలకపల్లి, అచ్చంపేట వెళ్లే మార్గాలలో మగ్దూంపూర్ చౌరస్తాలో ప్రమాదాలు లెక్కకు మించి అయ్యాయి. లింగాల నుంచి జీల్గుపల్లి, శాయిన్‌పేట, కొత్తకుంటపల్లి వెళ్లే మార్గంలో కూడలి కూడా ప్రమాదాలకు నిలయంగా మారింది. అయినా ఆర్‌అండ్‌బీ అధికారులలో ఎలాంటి చలనం రాలేదు. ఆదివారం లింగాలకు సమీపంలోని నాయనోనిపల్లి, లింగాలలో సంతకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు వస్తుంటారు. అయా కూడళ్లలో తగు సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కొల్లాపూర్ వెళ్లే మార్గంలో ఎలాంటి సూచిక బోర్డు లేని కూడలి



లింగాల నుంచి అచ్చంపేట, తెలకపల్లి వెళ్లే మార్గంలో ఉన్న ప్రధాన కూడలి



లింగాల నుంచి జీల్గుపల్లి, శాయిన్‌పేట, కొత్తకుంటపల్లి వెళ్లే కూడలి

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



అమ్రాబాద్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ



తాడూరు నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

అమ్రాబాద్: పరిసరాల శుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని ఎంపీడీఓ రామ్మోహన్ సూచించారు. శనివారం మండలంలోని ఉప్పునుంతల(బీకే) గ్రామాన్ని సందర్శించి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. వన నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్ లను పరిశీలించి, త్వరలోనే వర్మీ కంపోస్టు చేసే విధంగా పనులు చేపట్టాలని సూచించారు. అయన వెంట మండల పంచాయతీ విస్తరణాధికారి వెంకటయ్య, సర్పంచ్ గీత ఉన్నారు.

నర్సరీల పరిశీలన

తాడూరు: మండల కేంద్రంలోని నర్సరీని ఎంపీడీఓ గంగామోహన్, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఎండలు తీవ్రంగా ఉండడం వల్ల నర్సరీలో ఉన్న మొక్కలు ఎండిపోకుండా ప్రతి రోజు నీటిని అందించాలని అన్నారు. ప్రజలకు అవసరమైన మొక్కలను అందుబాటులో ఉంచి ప్రతి కుటుంబానికి పూలు, పండ్ల మొక్కలను ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. 24 పంచాయతీల పరిధిలోని నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా జూన్ మాసంలో ప్రారంభమయ్యే వర్షాలకు సిద్ధం చేసి ఉంచాలని ఉపాధి హామీ సిబ్బందిని సూచించారు.

ఎమ్మెల్యే ఆహ్వానం

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్టలో ఈ నెల 31, జూన్ 1వ తేదీ ఆంజనేస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ట, లింగప్రతిష్ట కార్యక్రమాలకు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సర్పంచ్ విజయ్ కుమార్ ఆహ్వానించారు.

ప్రారంభోత్సవానికి తరలిరండి

మన్ననూర్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీశైలం పుణ్యక్షేత్రం వద్ద నిర్మించిన తెలంగాణ ఆర్యవైశ్య సత్రం ప్రారంభోత్సవానికి ఆర్యవైశ్యులు కుటుంబ సమేతంగా పాల్గొనాలని సత్రం అధ్యక్షుడు శ్యాంసుందర్ కోరారు. శనివారం మన్ననూర్‌లోని పలువురు ఆర్యవైశ్యులను ఆయన కలిసి ఆహ్వానించారు. 29న ప్రారంభించి జూన్ 5వ తేదీ వరకు పలు కార్యక్రమాలు ఉంటాయన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడూరు: విద్యుత్ సరఫరాలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు సాంకేతిక సమస్యల కారణంగా అంతరాయం ఏర్పడుతుందని ఏఈ చందన్‌తేజ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు మేడిపూర్, యంగంపల్లిలోని సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఉన్నత లక్ష్యాలను సాధించాలి

కొల్లాపూర్: ఉన్నత లక్ష్యాలను విద్యార్థులు సాధించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సూచించారు. పాలిసెట్ ఎంట్రన్స్ టెస్టులో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను శనివారం ఆయన అభినందించారు. కేవైఎఫ్ ఆధ్వర్యంలో పాలిసెట్ ఉచిత శిక్షణ ఇవ్వడం ఇచ్చారని, శిక్షణ పొందిన విద్యార్థులు పలువురు మంచి ఫలితాలను సాధించారని తెలిపారు.

రోడ్డును ఏర్పాటు చేయండి

తెలకపల్లి: మండలంలోని గౌరారం నుంచి మామిళ్లపల్లికి, గౌరారం నుంచి పర్వతాపురానికి రోడ్డును ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గౌరారం నుంచి మామిళ్లపల్లికి వెళ్లడానికి కనీస రోడ్డు సౌకర్యం లేక మండల కేంద్రం నుంచి చుట్టూ తిరిగి దాదాపు 12కిలోమీటర్లు పైన వెళ్లాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్వతాపురానికి గౌరారానికి మట్టి రోడ్డు ఉన్నా ప్రస్తుతం చెరువు మిషన్ కాకతీయలో మరమ్మతు చేయడం వల్ల చెరువులోకి నీరు చేరి దాదాపు 4 ఏళ్ల నుంచి రోడ్డు మార్గం లేక రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులకు అభినందన

తాడూరు: జిల్లా స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ క్రీడాపోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను శనివారం సిర్సవాడ పాఠశాల ఆవరణలో వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు. వాలీబాల్ విభాగంలో సురేష్, హ్యాండ్ బాల్‌లో కార్తీక్, షాట్‌పుట్ బాలికల విభాగంలో సరిత, ఖోఖోలో శ్రావణి ఎంపికయ్యారు.రాష్ట్ర స్థాయిలో వీరు పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు కుర్మయ్య, సీతారాం నాయక్, క్రీడల కన్వీనర్ గంగామోహన్ తెలిపారు.

అలయ్ బలయ్‌ని విజయవంతం చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఈనెల 31న నిర్వహించనున్న గిరిజన అలయ్ బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఈ మేరకు శనివారం అలయ్ బలయ్‌కు సంబంధించిన కరపత్రాలను, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారని తెలిపారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కందనూలు: జిల్లాలోని అత్యంత పురాతన వైష్ణవ ఆలయాల్లో ఒకటైన శ్రీపురం రంగనాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రంగాచార్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా 29న అభిషేకం, తిరుమంజనం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యావచనం, రక్షా బంధనం, అంకురార్పణ, 30న అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, గరుడ ముద్ద, భేరీ పూజ, దేవతా హ్వానం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 31న శ్రీగోదా రంగనాథ స్వామి తిరు కల్యాణం, సాయంత్రం రథోత్సవం, జూన్ 1న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, దేవతోద్వాసన, ద్వాదశరాధన, ధ్వజ అవరోహణ, కుంభ ప్రోక్షణ తదితర పూజా ఉంటాయని తెలిపారు.



ముస్తాబైన శ్రీపురం రంగనాయ స్వామి దేవాలయం

ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించండి



హజ్ యాత్రికులకు టీకా వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన

కందనూలు: హజ్ యాత్రకు జిల్లా నుంచి వెళ్తున్న వారు ఈ ప్రాంత ప్రజల సంక్షేమం, సౌభాగ్యం కోసం ప్రార్థించాలని మున్సిపల్ చైర్ పర్సన్ కల్పన కోరారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడలోని ఫంక్షన్‌హాల్‌లో జిల్లాలోని హజ్ యాత్రికులకు శిక్షణ శిబిరంతోపాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టీకాల పంపిణీ నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ముస్లింలకు హజ్ యాత్ర ఎంతో పవిత్రమైనదని నిష్ఠతో కోరుకున్న కోరికలని అల్లా తీరుస్తాడని ప్రగాఢంగా నమ్ముతారని తెలిపారు. అంతకుముందు హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్ మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్‌తో పాటు కల్వకుర్తిలో హజ్ యాత్ర కోసం వెళ్తున్న వారి కోసం శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. యాత్రకు వెళ్లే వారి ఆన్‌లైన్ దరఖాస్తులతోపాటు నేరుగా దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన ధ్రువపత్రాలు ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. కొరంపేట మదరసాకు చెందిన మౌల్వి హఫీజ్ తస్లీమ్ అన్సారీ హజ్ యాత్రికులకు శిక్షణ ఇచ్చారు. యాత్రలో అనుసరించాల్సిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో ముస్లిం అడ్వయిజరి కమిటీ ఉపాధ్యక్షుడు యాకూబ్ బిన్ బావాజీర్, అల్హాజ్ మహమ్మద్ సాదిఖ్ పాషా, అబ్దుల్ హక్, హఫీజ్ మొహమ్మద్ మహబూబ్ అలీ, ఇబ్రహీం, ఆలీం, షంషేర్ ఖాన్, వకీల్ మౌలానా, మాక్సూద్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వాసులకు తీవ్ర గాయాలు



క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

మన్ననూర్: శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి వటువర్లపల్లి సమీపంలో ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని లింగంపల్లికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డి, అంజిరెడ్డి బైక్‌పై శ్రీశైలం దర్శనానికి వెళ్తున్నారు. అమ్రాబాద్ మండలంలోని వటువర్లపల్లి సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేయబోయి వెనుక నుంచి వేగంగా ఢీకొన్నారు. ప్రమాదంలో పవన్‌కుమార్‌రెడ్డి, అంజిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ ఈఎంటీ మల్లేష్, పైలెట్ సైదులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ప్రమాద స్థలంలో పడి ఉన్న ల్యాప్‌టాప్, రెండు ఫోన్‌లతో పాటు ఒక గోల్డ్ రింగ్‌ను అచ్చంపేట ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబ సభ్యులకు 108 సిబ్బంది అందజేశారు.

రూ.2వేల నోట్ల తిరస్కరణ

అచ్చంపేటలో గ్యాస్ వినియోగదారుల ఇబ్బందులు

అచ్చంపేట రూరల్: రూ.2వేల నోటు సామాన్య జనాలకు చుక్కలు చూపెడుతోంది. గ్యాస్ వినియోగదారుల నుంచి ఏజెన్సీ నిర్వాహకులు, సిబ్బంది ఆ నోటును తీసుకోవడం లేదు. ఈ సంఘటన నియోజకవర్గంలోని ఉప్పునుంతల మండలం కాంసానిపల్లి, కాంసానిపల్లి తండాలో చోటు చేసుకుంది. నోటును ఎందుకు తీసుకోవడం లేదని సిబ్బందితో వినియోగదారులు వాగ్వివాదం చేశారు. అచ్చంపేటలో భారత్‌గ్యాస్ ద్వారా వినియోగదారులకు సిలిండర్లు అందిస్తున్నారు. ప్రతి శనివారం ఉప్పునుంతల మండల కేంద్రం, ఇతర గ్రామాలకు సిలిండర్లను అందిస్తున్నారు. బుక్ చేసుకున్న వినియోగదారులు నిండు సిలిండర్‌ను తీసుకుని రూ.2వేల నోటును ఇంటి వద్దకు వచ్చిన సిబ్బందికి ఇవ్వగా నిరాకరించారు. తమ గ్యాస్ మేనేజర్ నోటును తీసుకోవద్దని చెప్పారని, తాము తీసుకోమని చెప్పారు. రూ.1,173లుగా ఉన్న సిలిండర్ ధర రూ.1,230 తీసుకుంటున్నా తాము ఏమీ అనడం లేదని, బ్యాంకుల్లో నోటును మార్చుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నారని వాపోయారు. అన్ని దుకాణాల్లో రూ.2వేల నోటును తీసుకుంటున్నా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం తీసుకోవడం లేదని వాపోయారు.

అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయాలి

బల్మూర్: 18ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరిని ఓటర్లుగా నమోదు చేసే బాధ్యత బీఎల్‌ఓలదేనని ఆర్డీఓ పాండునాయక్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బీఎల్‌ఓలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఫాం–6 ద్వారా 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయడంతో పాటు ఫాం–7 కింద తొలగింపులు చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు ఓటర్లు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఇందుకోసం బీఎల్‌ఓలు తప్పనిసరి గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి విచారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, తహసీల్దార్ కిష్ట్యానాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ, తహసీల్దార్

వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న గణేష్‌రావు

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను గ్రామాలలో కార్యకర్తలు ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేష్‌రావు పిలుపునిచ్చారు. గంట్రావుపల్లిలో శనివారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలపై ఉందని సూచించారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి వచ్చే శాసనసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాగరాజు, చంద్రయ్య, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..

కల్వకుర్తిరూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మార్చాలలో మార్నింగ్‌వాక్ నిర్వహించారు. గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన మల్లేష్‌ను ఆయన సన్మానించారు. ఆయన వెంట నిజాముద్దీన్, యాదయ్య, రామాంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతి ఉన్నారు.



వృద్ధుడితో మాట్లాడుతున్న సుంకిరెడ్డి

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న బంగారు శ్రుతి

బిజినేపల్లి: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి కార్యకర్త పార్టీ కోసం పని చేయాలని, బూత్‌ల వారీగా ఓటర్లకు కేంద్ర పథకాల గురించి పొత్యాంశంగా వివరించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు భూషయ్య ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ.. మే 30వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రతి పార్లమెంట్, అసెంబ్లీ, మండల పరిధిలో ముఖ్యమైన కార్యక్రమాలు నిర్వహించబడుతాయన్నారు. రైతులకు చేస్తున్న అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎండగడుతూ ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో దిలీపాచారి, నారాయణాచారి, తిరుపతయ్య, లక్ష్మణ్, బుడ్డన్న, బాలస్వామి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులతో వేధింపులు

- నియోజకవర్గానికి ఎమ్మెల్యే అన్యాయం చేశాడు
- పీపుల్స్ మార్చ్‌లో భట్టి విక్రమార్క

బిజినేపల్లి: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాడిన కాంగ్రెస్ కార్యకర్తలైన నిర్వాసితులపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మండిపడ్డారు. పీపుల్స్ మార్చ్‌లో భాగంగా 72వ రోజు పాలమూర్ – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వట్టెం జలాశయం గుండా నిర్వహించిన పాదయాత్రకు ప్రాజెక్టు నిర్వాసితులు, రైతులు, పార్టీ శ్రేణులు ఆయనతో కలిసి నడిచారు. రాంరెడ్డిపల్లితాండా నుంచి ప్రారంభమైన పాదయాత్ర వట్టెంలోని కేఎస్ఆర్ కంపెనీ మీదుగా అనేఖాన్‌పల్లి తండాకు చేరుకున్నారు. పాదయాత్రలో కూడు, గూడు పోగొట్టుకున్న నిర్వాసితుల ఇంటి గడపను దాటి వారి గోడును విన్నారు. భూమి, ఇల్లు కోల్పోయి రేకుల డబ్బాల్లో, తడకల్లో నివాసం ఉంటున్నామని, తాము రైతుల నుంచి అడ్డా కూలీలుగా మారిపోయామని నిర్వాసితులు కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం అనేఖాన్‌పల్లితండా వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం నిర్వాసితుల సమస్యలు విన్నారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తమకు తీవ్ర అన్యాయం చేశారని, ఆర్ అండ్ఆర్ ప్యాకేజీలో జరిగిన నష్టం, పరిహారం కేటాయింపులో అన్యాయం, అవినీతితో పాటు తమను చెంబు చాటలు, కట్టుబట్టలతో అధికారులు పంపించి రోడ్డు పాలు చేశారని వివరించారు. అనంతరం నిర్వాసితులకు భోజనం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుచుకుళ్ల సుహాసన్‌రెడ్డి ఏర్పాటు చేసిన విడిదిలో బస చేశారు. అనంతరం ప్రాజెక్టు మీదుగా కుమ్మెరకు చేరుకున్నారు. రాత్రి అక్కడే బస చేశారు.



పాదయాత్రగా వస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

30న మండల సర్వసభ్య సమావేశం

నాగర్‌కర్నూల్‌రూరల్: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కోటేశ్వర్‌రావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు సమావేశం ఉంటుందని, సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

బీసీ ఐక్యవేదిక కమిటీ ఎన్నిక

లింగాల: మండల కేంద్రంలోని రామాలయంలో శనివారం తాత్కాలిక బీసీ ఐక్య వేదిక మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సింగం రాజిలయ్య, ప్రధాన కార్యదర్శులుగా సత్య, రాజేష్, ఉపాధ్యక్షులుగా మురళి, నవీన్, రమేష్, సభ్యులను నియమించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

తరలిన నాయకులు

కల్వకుర్తిరూరల్: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమానికి శనివారం నియోజకవర్గ కోఆర్డినేటర్ యాదిలాల్ ఆధ్వర్యంలో నాయకులు తరలి వెళ్లారు. ఆయన వెంట వజ్రలింగం, యాదయ్య, సత్యం పలువురు ఉన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



అచ్చంపేట రూరల్: ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి దాతలు సహకరిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్ తెలిపారు. శనివారం హైదరాబాద్ చెందిన గంధం శ్రీరాములు, వెంకటలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహించారు. వారు రూ.25,116 నిత్యాన్నదానానికి అందజేశారు.

8న చేప ఆహార ఉత్పత్తుల మేళా

కందనూలు: మృగశిర కార్తీ సందర్భంగా వచ్చే నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప ఉత్పత్తుల ఆహార మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫిషరీస్ అధికారి లక్ష్మప్ప శనివారం ప్రకటనలో తెలిపారు. 10 స్టాల్స్‌లో వివిధ రకాల చేపలు, రొయ్యలతో చేసిన వంటకాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. స్టాల్స్ ఏర్పాటు కోసం ఆసక్తి కలిగిన, వంటలో అనుభవం ఉన్న వారు జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 81253 16307, 88970 73207 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

తెలకపల్లి: మండల కేంద్రంలోని వీఓఏలు తమ సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న నిరవధిక సమ్మె శనివారం 42వ రోజుకు చేరింది. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కోరారు. 40 రోజులకు పైగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం తమపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, గిరిజా, ఖాజాజీ, నీలమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు